క్లుప్తంగా

ఆలయంలో ప్రత్యేక పూజలు



పూజలో పాల్గొన్న భక్తులు

నకిరేకల్ : మండలంలోని చందుపట్ల గ్రామంలో గల శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో మంగళవారం గోదారంగనాయకస్వామి 16 రోజుల పండుగను ఘనంగా నిర్వహించారు. గోదా భక్త మండలి సభ్యులు స్వామివారికి పుష్పమాలలు, తులసి మాలలు తీసుకువచ్చి ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలు సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మేడవరపు కిషన్‌రావు, గోదాదేవి భక్త మండలి సభ్యులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నల్లగొండ: నీలగిరి పట్టణంలో బుధవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏడీఈ వేణుగోపాలచార్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ఎలిసాల కాలనీ, శ్రీనగర్ కాలనీ, సూర్యలోక్ కాంప్లెక్స్, జీకే మూర్తి ఆస్పత్రి ఏరియా, మినిస్టర్ గెస్టు హౌజ్ వీధి, రామగిరి, ఎన్జీ కాలనీ, శ్రీనివాస కాలనీ, మదీనా కాంప్లెక్స్, పోలీస్ హెడ్‌క్వార్టర్స్, బీట్ మార్కెట్, కనకదుర్గకాలనీ, ఎస్పీటీ మార్కెట్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

క్షయ నిర్ధారణ కేంద్రం తనిఖీ



సిబ్బందితో మాట్లాడుతున్న డాక్టర్ కల్యాణ్ చక్రవర్తి

నకిరేకల్ : పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో అత్యాధునిక క్షయ నిర్ధారణ(తెమడ) పరీక్ష కేంద్రాన్ని మంగళవారం క్షయ నివారణ జిల్లా అధికారి డాక్టర్ కల్యాణ చక్రవర్తి తనిఖీ చేశారు. కేంద్రంలో జరుగుతున్న పరీక్షల తీరును సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట యాసారపు రామకృష్ణ, జిల్లా టీడీ ఫార్మసిస్ట్ రఘురాంరెడ్డి, ల్యాబ్ టెక్నీషియన్ గోవర్ధన్ తదితరులు ఉన్నారు.

నేడు రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు

నార్కట్‌పల్లి: రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా బుధవారం నార్కట్‌పల్లిలోని కామినేని మెడికల్ కళాశాలలో రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించనున్నారు. ఈ సదస్సులో రక్షణ రోడ్డు సేఫ్టీ ఫౌండేషన్ చైర్మన్, రిటైర్డు ఆర్‌టీఓ కోమటి రెడ్డి మోహన్‌రెడ్డి, డీటీసీ వాణి, ఫౌండేషన్ ప్రమోటర్ విజయపాల్‌రెడ్డి, బీఎల్.కుద్దల్ పాల్గొననున్నారు.

ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి ఫ్లెక్సీకి పాలాభిషేకం



పాలాభిషేకం చేస్తున్న గ్రామస్తులు

మునుగోడు: ప్రభుత్వం అందిస్తున్న నాలుగు సంక్షేమ పథకాలకు మొదటి దఫాలో తమ గ్రామాన్ని ఎంపిక చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ మునుగోడు మండలంలోని గుండ్లోరిగూడెం గ్రామ ప్రజలు మంగళవారం ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జంగిలి నాగరాజు, ఈర్ల సత్తయ్య, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు విరాళం



హెచ్‌ఎంకు చెక్కు అందజేస్తున్న సందీప్‌రెడ్డి

వేములపల్లి (మాడుగులపల్లి) : మాడుగులపల్లి మండలంలోని చర్లగూడెం గ్రామానికి చెందిన గోలి లింగారెడ్డి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ గోలి సందీప్‌రెడ్డి ఆగామోత్కూర్ జెడ్పీహెచ్‌ఎస్‌లో రెండు కంప్యూటర్ల ఏర్పాటుకు రూ.1.25లక్షల విలువైన చెక్కును హెచ్‌ఎం ఏలేటి వినోద్‌కుమార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా గోలి సందీప్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు కంప్యూటర్ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని, ప్రపంచమంతా కంప్యూటర్ యుగం నడుస్తోందన్నారు. భవిష్యత్‌లో పాఠశాలకు మరిన్ని కంప్యూటర్లు అందిస్తానన్నారు. అనంతరం సందీప్‌రెడ్డిని పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గోలి నారాయణరెడ్డి, ఉపాధ్యాయులు నగేష్, జనార్దన్, నరేందర్‌రెడ్డి, ఆనంద్ కుమార్, ఆనందరెడ్డి, గురవయ్య, రమాజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ బీటీ రోడ్లకు మహర్దశ

- మునుగోడు, చండూరు మండలాల్లో ముమ్మరంగా పనులు
- నాలుగు మీటర్ల వెడల్పు గల రోడ్లు ఆరు మీటర్లకు పెంపు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు



కొనసాగుతున్న గుండ్లోరిగూడెం బీటీ రోడ్డు పనులు

మునుగోడు: మండలంలోని బీటీ రోడ్లకు మహర్దశ పట్టనుంది. ఇన్నాళ్లూ ఇరుకు రోడ్లపై ప్రయాణించిన వాహనదారుల, ప్రయాణికుల కష్టాలు ఇక తీరనున్నాయి. ఇప్పటి వరకు కేవలం నాలుగు మీటర్ల వెడల్పు మాత్రమే ఉన్న గ్రామీణ బీటీ రోడ్లు ఇక నుంచి ఆరు మీటర్ల వెడల్పుతో నిర్మించనున్నారు. మండలంలోని పలు గ్రామాలకు ఇటీవల మంజూరైన బీటీ రోడ్లను మొదట నాలుగు మీటర్ల వెడల్పుతోనే నిర్మించేలా అధికారులు డిజైన్ చేశారు. ఆ డిజైన్ల ప్రకారం ప్రభుత్వం నుంచి నిధులు మంజూరయ్యాయి. దీంతో పలు గ్రామాల్లో బీటీ రోడ్ల నిర్మాణ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. అయితే స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఇటీవల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో పెరుగుతున్న జనాభాకు తగినట్టుగా రోడ్ల వెడల్పు మరికొంత పెంచి నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు. అందుకు అవసరమైన నిధులు ప్రభుత్వం నుంచి మంజూరు చేయిస్తానని చెప్పారు. దీంతో సంబంధిత అధికారులు ప్రస్తుతం నిర్మిస్తున్న రోడ్లను మరో రెండు మీటర్ల వెడల్పు పెంచి నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. పనులు చేస్తున్న కాంట్రాక్టర్లకు రోడ్డు వెడల్పు పెంచాలని సూచించారు.

20 గ్రామాలకు బీటీ రోడ్లు..

ప్రస్తుతం మునుగోడు సబ్ డివిజన్ పరిధిలో మునుగోడు, చండూరు మండలాల్లోని 20 గ్రామాలకు నూతన బీటీ రోడ్ల ఏర్పాటుకు గ్రామీణ ప్రాంతాల నిర్మాణ నిధుల నుంచి రూ.35.76 లక్షల నిధులను గత ఏడాది ఏప్రిల్ మాసంలో ప్రభుత్వం మంజూరు చేసింది. ఆ నిధులతో 39.77 కిలోమీటర్ల పొడవు, 4 మీటర్ల వెడల్పుతో రోడ్లు నిర్మించాల్సి ఉంటుంది. ఆ పనులు చేసేందుకు టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్లు నాలుగు నెలల క్రితం పనులు ప్రారంభించారు. ఆ రోడ్లు ఇప్పుడు 6 మీటర్ల వెడల్పుతో చేపట్టేలా అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేయడంతోపాటు పనులు ముమ్మరంగా కొనసాగిస్తున్నారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డు వేయాలని గతంలో వేడుకున్నాం



మా గ్రామానికి బీటీ రోడ్డు లేకపోవడంతో ఎంతో కాలంగా రోడ్డు వేయించాలని ప్రజాప్రతినిధులను, అధికారులను వేడుకున్నాం. స్థానిక ఎమ్మెల్యే ప్రత్యేక చొరవతో మా గ్రామానికి రోడ్డు మంజూరు చేశారు. మొదట 4 మీటర్ల వెడల్పుతో రోడ్డు వేస్తామని పనులు ప్రారంభించారు. దానిని 6 మీటర్లకు పెంచేలా ఎమ్మెల్యే కృషిచేయడం హర్షనీయం. ఆలస్యమైనా మా గ్రామానికి పెద్ద రోడ్డు వస్తుందని మా గ్రామ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

– దోటి నారాయణ, గుండ్లోరిగూడెం

ఆరు మీటర్ల వెడల్పుతో నిర్మిస్తున్నాం



సీఆర్‌ఆర్ నిధుల నుంచి మునుగోడు, చండూరు మండలాల్లోని 20 గ్రామాలకు 39.77 కిలో మీటర్ల దూరం 4 మీటర్ల వెడల్పుతో పనులు చేసేందుకు రూ. 35.76 లక్షల నిధులు మంజూరు కాగా ఆ పనులు కొనసాగుతున్నాయి. అయితే 4 మీటర్లు కాకుండా రోడ్డు వెడల్పు 6 మీటర్లకు పెంచాలని ఎమ్మెల్యే సూచించారు. ఆయన సూచన ప్రకారం వెడల్పు 6 మీటర్లకు పెంచి రోడ్లు నిర్మిస్తున్నాం. అదనపు నిధుల కోసం ప్రతిపాదనలు సిద్ధంచేశాం.

– సతీష్ రెడ్డి, ఏఈ, మునుగోడు

విద్యార్థులు ఉన్నత శిఖరాలను చేరుకోవాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి



కనగల్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

కనగల్ : విద్యార్థులు బాగా చదువుకుని సమాజంలో ఉన్నత శిఖరాలను చేరుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. మంగళవారం కనగల్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జెడ్పీహెచ్‌ఎస్‌లో చేపట్టిన భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. పాఠశాల పరిసరాలు, మరుగుదొడ్లను తనిఖీ చేశారు, అనంతరం తొమ్మిది, పదో తరగతి విద్యార్థుల తరగతి గదిల్లోకి వెళ్లి వారితో ముఖాముఖి మాట్లాడారు. అనంతరం ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి ఇటీవల వైద్య ఆరోగ్య కేంద్రానికి పంపించిన సామగ్రిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పద్మ, వైద్యాధికారి రామకృష్ణ పాల్గొన్నారు.

హెచ్‌ఎం, పీఈటీని సస్పెండ్ చేయాలని వినతి

నల్లగొండ టౌన్: మధ్యాహ్న భోజన పథకం కార్మికులను వేధింపులకు గురిచేస్తున్న ప్రధానోపాధ్యాయుడు, పీఈటీని సస్పెండ్ చేయాలని కోరుతూ తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పోలె సత్యనారాయణ, మునుగోడు సీఐటీయూ మండల కన్వీనర్ వరికుప్పల ముత్యాలు మంగళవారం డీఈఓ భిక్షపతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మునుగోడు మండలం కొంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు తమకు విద్యార్థులతో పాటు గుడ్లు పెట్టాలని కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. వారు సహకరించపోవడంతో ప్రధానోపాధ్యాయులు వంట మనుషులను పని చేయనీయకుండా ఉపాధ్యాయులతో వంట చేయిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన పథకం కార్మికులు బోయపర్తి సుజాత, బోయపర్తి సుగుణమ్మ, బోయపర్తి అంజమ్మ తదితరులు ఉన్నారు.

ఆదమరిస్తే అంతే సంగతులు..!



తుడిమిడి-చిత్తలూరు రోడ్డుపై ఏర్పడిన గొయ్యి

శాలిగౌరారం: మండలంలోని తుడిమిడి-చిత్తలూరు ప్రధాన రోడ్డుపై తుడిమిడి గ్రామ సమీపంలో సుమారు 4 అడుగుల లోతు ఏర్పడిన భారీ గుంత ప్రమాదకరంగా మారింది. అసలే సింగిల్‌రోడ్డు కావడం, మూసీనది నుంచి తుడిమిడి ఇసుక రీచ్ ద్వారా నిత్యం పదుల సంఖ్యలో ఇసుక ట్రాక్టర్లు నడుస్తుండడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. దగ్గరకు వచ్చేవరకు రోడ్డుపై పడిన గుంత కనిపించకపోవడంతో వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. ఎదురుగా వాహనాలు వచ్చినప్పుడు లేదా ముందు పోయే వాహనాలను అధిగమించే సమయంలో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. పగలే ఇలా ఉంటే ఇక రాత్రి వేళల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. శాలిగౌరారం మండల కేంద్రం నుంచి చిత్తలూరు గ్రామానికి వెళ్లాలంటే ఈ రోడ్డు మార్గం ఒక్కటే ఉండడంతో వాహనాల రాకపోకలు అధికంగా జరుగుతుంటాయి. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుపై పడిన భారీ గుంతను పూడ్చి రోడ్డు ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

సేంద్రియ ఎరువు తయారీపై దృష్టి సారించాలి



నారెగూడెంలో వర్మీ కంపోస్ట్ షెడ్‌ను పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ వెంకటేశ్వర్లు

కట్టంగూర్ : సేంద్రియ ఎరువు తయారీపై అధికారులు దృష్టి సారించాలని డివిజనల్ పంచాయతీ అధికారి వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం కట్టంగూర్ మండలంలోని నల్లగుంటబోలు, నారెగూడెం, పందెనపల్లి, చెర్వుఅన్నారం, అయిటిపాముల గ్రామాల్లో వైకుంఠధామాలు, కంపోస్ట్ షెడ్‌లను ఆయన పరిశీలించారు. వైకుంఠధామాలు, కంపోస్ట్‌షెడ్‌లను పరిశుభ్రంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు సమయపాలన పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. గ్రామాల్లో మంచినీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట ఎంపీఓ చలపతి, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలి




నిల్వ ఉంచిన మందులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రీనివాస్

రామగిరి(నల్లగొండ) : వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ పి.శ్రీనివాస్ సూచించారు. నల్లగొండ మండల పరిధిలోని రాములబండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలోని రిజిస్టర్లు, ల్యాబ్, ఫార్మసీని పరిశీలించారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ఆయనవెంట డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, డీఐఓ డాక్టర్ పద్మ, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అబ్దుల్ జమీర్, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

మారని సమాచారం

చండూరు (గట్టుప్పల్) : గట్టుప్పల్ మండలం కమ్మగూడెం గ్రామపంచాయతీ కార్యాలయంలో సమాచార బోర్డుపై బదిలీపై వెళ్లిన అధికారుల పేర్లే ఇంకా దర్శనమిస్తున్నాయి. బోర్డుపై పేర్లు రాసి ఉన్న అధికారులు సంవత్సరం క్రితమే బదిలీ అయ్యారు. అయినా వారిపేర్లు మార్చలేదు. ప్రస్తుతం పనిచేస్తున్న అధికారుల పేర్లు రాయలేదు. దీంతో ఏదేని సమాచారం కోసం కార్యాలయానికి వెళ్లేవారు ఇబ్బందులు పడుతున్నారు.



కమ్మగూడెం పంచాయతీలో గతంలో పనిచేసిన అధికారుల పేర్లతోనే బోర్డు

దగాకోరు సర్కారుపై దండెత్తుదాం..



సిమెంటు బెంచీపై కూర్చుని మాట్లాడుకుంటున్న హోం శాఖ మాజీ మంత్రి మహమూద్ అలీ, మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

చిట్యాల: మండలంలోని పెద్దకాపర్తి గ్రామంలో బీఆర్‌ఎస్ పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి హాజరయ్యేందుకుగాను కేటీఆర్ కాస్త ఆలస్యంగా వచ్చారు. కేటీఆర్‌కు స్వాగతం పలికేందుకు నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలి వచ్చారు. అదే సమయంలో రాష్ట్ర హోం శాఖ మాజీ మంత్రి మహమూద్ అలీ సైతం అక్కడికి వచ్చారు. అక్కడ కూర్చునేందుకు ఎలాంటి ఏర్పాట్లు లేకపోవడంతో మూసి ఉన్న డబ్బా ముందు ఉన్న సిమెంటు బెంచీపై మహమూద్ అలీతో పాటు నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య కూర్చున్నారు. అధికార పార్టీపై పోరాటాలు ఎలా చేయాలన్నట్లుగా ఒకరికొకరు మాట్లాడుకున్న తీరు ఆ పార్టీ నాయకులను, కార్యకర్తలను ఆకట్టుకుంది.

బీఆర్‌ఎస్ జెండా ఎగురవేసిన కేటీఆర్

చిట్యాల: నల్లగొండలో చేపట్టిన రైతు మహాధర్నాకు వెళ్తున్న బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మంగళవారం చిట్యాల మండలంలోని పెద్దకాపర్తి గ్రామ బస్‌స్టేజీ వద్ద బీఆర్‌ఎస్ జెండాను ఆయన ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో మాజీ హోంమంత్రి మహమద్ అలీ, మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య , దూదిమెట్ల బాలరాజు, పల్లె రవికుమార్, జడల ఆదిమల్లయ్య, కల్లూరి మల్లారెడ్డి, జనగాం నర్సింహగౌడ్, పెద్దబోయిన సత్తయ్య, దేవరపల్లి సత్తిరెడ్డి పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయం విద్యార్థుల ట్రెక్కింగ్



గోపలాయిపల్లి గుట్టపైకి ట్రెక్కింగ్ చేస్తున్న విద్యార్థులు

రామగిరి(నల్లగొండ), నార్కట్‌పల్లి : నల్లగొండ కేంద్రీయ పాఠశాల విద్యార్థులు మంగళవారం ట్రెక్కింగ్ చేశారు. బ్యాగ్‌లెస్ డేస్ కార్యక్రమంలో భాగంగా నార్కట్‌పల్లి మండలం గోపలాయిపల్లి గుట్టను అధిరోహించారు. 6,7,8 తరగతికి చెందిన సుమారు 210 విద్యార్థులు, 10 మంది వలంటీర్లు ట్రెక్కింగ్ చేశారు. గుట్టపై మొక్కలు నాటి పరిసరాలను పరిశుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ జి.శ్రీనివాసులు, పర్యావరణ సేవకుడు సురేష్‌గుప్తా, ఉపాధ్యాయులు వందన, ఆర్.శ్రీనివాస్, మనీషా, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేత

చిట్యాల: మండలంలోని వెలిమినేడు గ్రామంలో సంక్రాంతి పండుగ సందర్భంగా డీవైఎఫ్‌ఐ, ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా పోటీల్లో విజేతలకు మంగళవారం డీవైఎఫ్‌ఐ మండల అధ్యక్షుడు పంది నరేష్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ గ్రామ అధ్యక్ష, కార్యదర్శులు కురాకుల బాలు, అర్రూరి పవన్, ఎస్‌ఎఫ్‌ఐ గ్రామ అధ్యక్షుడు అర్రూరి ప్రణీత్, రైతు సంఘం నాయకులు అర్రూరి శ్రీనివాస్, నెల్లికంటి నర్సింహ, దేశబోయిన స్వరూప, నర్సింహ, నాతి వెంకట్రామయ్య, అర్రూరి దుర్గయ్య పాల్గొన్నారు.

పదవి లేకున్నా పట్టణ అభివృద్ధికి కృషి



అబ్బగోని రమేష్‌గౌడ్-కవిత దంపతులను సన్మానిస్తున్న కాలనీవాసులు

నల్లగొండ టూటౌన్: పదవులు ఉన్నా లేకున్నా ప్రజల సమస్యల పరిష్కారం, పట్టణ అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని నల్లగొండ మున్సిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. వైస్ చైర్మన్ పదవీ కాలాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా అబ్బగోని రమేష్‌గౌడ్-కవిత దంపతులకు మంగళవారం నల్లగొండ పట్టణంలోని 47వ వార్డు విద్యానగర్ పార్కులో ఆత్మీయ అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ మంత్రి కోమటిరెడ్డి సహకారంతో పట్టణంలోని కోట్లాది రూపాయలతో ఎన్నో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. అనంతరం అబ్బగోని రమేష్ గౌడ్-కవిత దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో చొల్లేటి ప్రభాకర్, పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, విద్యానగర్ కాలనీవాసులు పాల్గొన్నారు.

చెర్వుగట్టు ఆలయానికి రూ.2 కోట్ల ఆదాయం

నార్కట్‌పల్లి : మండల పరిధిలోని చెర్వుగట్టు ఆలయం ఆవరణలో సోమవారం నిర్వహించిన వివిధ టెండర్ల ద్వారా ఆలయానికి సుమారు రూ.2 కోట్ల ఆదాయం వచ్చినట్లు మంగళవారం ఆలయ ఈఓ నవీన్‌కుమార్ తెలిపారు. ఆలయ టెండర్ నిర్వహణ ఇన్‌చార్జ్ ఈర్ల శ్రీనివాస్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. టోల్‌గేట్ నిర్వహణకు 15 నెలల కాలానికి రూ.32 లక్షలు, గట్టుపైన కిరాణ షాపు ఏర్పాటుకు సంవత్సర కాలానికి రూ.40 లక్షలు, కొబ్బరి చిప్పలు సేకరించుకునుందుకు రూ.38 లక్షలు, టాయిలెట్స్ నిర్వహణకు రూ.13 లక్షలు, కూల్ డ్రింక్స్ విక్రయించేందుకు రూ.15 లక్షలు, వడి బియ్యం సేకరణకు రూ.13 లక్షలు, అమ్మవారి ఆలయ సమీపాన షాపు నిర్వయించేందుకు ఒకటో నంబర్ షాపునకు రూ.15లక్షలు, రెండో నంబర్ షాపునకు రూ.7లక్షలు, మూడో నంబర్ షాపునకు సంవత్సర కాలానికి రూ.6 లక్షల 50 వేలు, మిగతా వివిధ టెండర్లు కలుపుకుని దాదాపు రూ.2 కోట్ల వరకు ఆదాయం సమకూరనున్నట్లు తెలిపారు. టోల్‌గేట్ నిర్వహణకు గత టెండర్‌దారుడు రూ.11 లక్షలు చెల్లించలేదని అందుకు మధ్యంతర టెండర్ నిర్వహించినట్లు తెలిపారు.

బైక్ రేసింగ్ చేస్తే కఠిన చర్యలు



రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ

మిర్యాలగూడ టౌన్ : పట్టణ కేంద్రంలో బైక్ రేసింగ్‌కు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్‌రాజు అన్నారు. మంగళవారం మిర్యాలగూడ రూరల్ పోలీస్ స్టేషన్‌ను డీఎస్పీ తనిఖీ చేశారు. అనంతరం పలు రికార్డులను ఆయన పరిశీలించి మాట్లాడారు. మిర్యాలగూడలోని ఈదులగూడెం చౌరస్తా నుంచి అద్దంకి-నార్కట్‌పల్లి బైపాస్ ఫ్లైఓవర్ బ్రిడ్జి వరకు కొంతమంది బైక్ రేసింగ్, బెట్టింగ్‌లకు పాల్పడుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని తెలిపారు. ప్రధాన రోడ్లలో అతివేగంగా వాహనాలు నడిపితే వాటిని పట్టుకొని సీజ్ చేస్తామని హెచ్చరించారు. వార్డుల్లో వీధి వ్యాపారులు కూడా మైకులను పెట్టి ప్రజలకు ఇబ్బందిగా మారుస్తున్న వారు సౌండ్‌తో వచ్చే మైకులను తీసుకొని తిరగవద్దన్నారు. ఆయన వెంట రూరల్ సీఐ వీరబాబు, ఎస్‌ఐలు లోకేష్, వెంకటేశ్వర్లు ఉన్నారు.

కార్పొరేట్ల కోసమే యూపీఎస్ విధానం



దామెరభీమనపల్లి పాఠశాలలో యూపీఎస్ ప్రతులను దహనం చేస్తున్న ఉపాధ్యాయులు

మర్రిగూడ : కేంద్ర ఆర్థిక శాఖ కార్పొరేట్ శక్తులకు తలొగ్గి యూపీఎస్ విధానాన్ని తీసుకురావడం అప్రజాస్వామికమని తెలంగాణ రాష్ట్ర సీపీఎస్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఉదావత్ లచ్చిరాంనాయక్ అన్నారు. ఇటీవల కేంద్ర ఆర్థిక శాఖ యూనిఫైడ్ పెన్షన్ విధానంపై జారీ చేసిన నోటిఫికేషన్‌ను వ్యతిరేకిస్తూ మర్రిగూడ మండలంలోని దామెరభీమనపల్లి ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు యూపీఎస్ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా లచ్చిరాం నాయక్ మాట్లాడుతూ సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని దశాబ్ద కాలంగా పోరాటాలు చేస్తుంటే యూపీఎస్ విధానాన్ని తీసుకురావడం అన్యాయమన్నారు. సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కడపర్తి సంజీవరావు, రాసమల్ల సికిందర్, కొండ శ్రీనివాస్, పరంగి, మంజులత, నుశ్రత్ బేగం తదితరులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌పై ఫిర్యాదు

తిప్పర్తి : స్థానిక గ్రామపంచాయతీ ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ ఝాన్సీపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బీజేపీ మండల అధ్యక్షుడు వంగూరి రవి గ్రామస్తులతో కలిసి మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో సూపరింటెండెంట్ అల్తాఫ్ హుస్సేన్‌కు ఫిర్యాదు చేశారు. నూతన జాబ్ కార్డు కావాలంటే ఫీల్డ్ అసిస్టెంట్ డబ్బులు వసూలు చేస్తోందని, తిప్పర్తి గ్రామ పంచాయతీలో 150కిపైగా గ్రూపులు ఉన్నప్పటికీ కొంత మందికే పనులు కల్పిస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో వడ్డె శ్రీనివాస్‌రెడ్డి, పల్లె జానయ్య ఉన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

చండూరు (గట్టుప్పల్) : గట్టుప్పల్ మండల ధర్మ సమాజ్ పార్టీ నూతన కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పార్టీ మండల అధ్యక్షుడిగా భీమనపల్లి మారయ్య, ప్రధాన కార్యదర్శిగా బొట్ల రాంబాబు, ఉపాధ్యక్షులుగా మహేష్, అజయ్, ప్రభాకర్, ఇతర కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

అర్హులకు పథకాలు వర్తింపజేయాలి

నల్లగొండ టౌన్: అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొలుగురి నరసింహ, అధ్యక్షుడు లొడంగి శ్రవణ్‌కుమార్ ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. జాతీయ గ్రామీణఉపాధి హామీ పథకంలో కూలీలకు 200 రోజులు పని దినాలు పెంచి పెరుగుతున్న ధరలకు అనుగుణంగా రోజువారి కూలీ రూ.700 ఇవ్వాలని డిమాండ్ చేశారు.

రోడ్డు విస్తరణ పనుల పరిశీలన

తిప్పర్తి : మండల కేంద్రంలో ఆర్‌అండ్‌బీ నిధులు రూ.9 కోట్లతో చేపడుతున్న రోడ్డు విస్తరణ, సుందరీకరణ పనులను మంగళవారం ఆర్‌అండ్‌బీ డీఈ గణేశ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు విస్తరణ, డ్రెయినేజీ పనులను వేగవంతంగా చేయాలని, నాణ్యత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో సబ్ ఇంజనీర్ ప్రసాద్, సూపర్‌వైజర్ రాము, కాంట్రాక్టర్ వెంకటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న డీఈ గణేశ్